క్లుప్తంగా

సమస్యలపై కలెక్టర్‌కు వినతులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మార్తమ్మ

మార్కాపురం: తన కుమారుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని, ఆదుకోవాలని కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేమా మార్తమ్మ సోమవారం మార్కాపురం వచ్చిన కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసింది. దీనిపై స్పందించిన కలెక్టర్ వైద్యా ఆరోగ్య శాఖ, ఆరోగ్య శ్రీ ట్రస్టు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సబ్ కలెక్టర్‌ను కలవాలని మార్తమ్మకు సూచించారు. అలాగే రాజంపల్లిలోని కేంద్రియ విద్యాలయానికి బస్సు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ రఘునాథరెడ్డి, గురవయ్య తదితరులు కోరారు. పాఠశాల ప్రారంభమైనప్పటికీ బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వివరించగా.. తాను పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు.

కంభం ఎంపీడీఓగా మస్తాన్‌వలి

కంభం: కంభం ఎంపీడీఓగా సయ్యద్ మస్తాన్ వలి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ నర్సయ్య కొమరోలుకు బదిలీ అయిన నేపథ్యంలో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న మస్తాన్‌వలికి ఎఫ్ఏసీ బాధ్యలు అప్పగించారు. నేపద్యంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన పొదిలి తహసీల్దార్

పొదిలి: మండల నూతన తహసీల్దార్‌గా అశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలు, ఇతర సిబ్బంది నూతన తహసీల్దార్‌ను ఘన స్వాగతం పలికి సత్కరించారు.

బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎంలు

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు, రేగడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా సుజాత, ఎస్పీ సుధారాణి, రామాంజనేయులు సోమారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. వారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు, పూర్వ విద్యార్థులు కలిసి అభినందించారు.

సచివాలయాలు ఆధునిక దేవాలయాలు

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు రైతుల పాలిట ఆధునిక దేవాలయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నదోర్నాలలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. మానవ సేవయే మాధవసేవ అన్న లక్ష్యంతో ఆధునిక దేవాలయాలు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నాయని కొనియాడారు. సచివాలయంలో పని చేసే ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పారదర్శకతతో పాటు జవాబుదారీతనంలో పని చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తున్నారని చెప్పారు. కుల మతాలు, పార్టీలకతీతంగా ప్రతి పథకాన్ని ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సమూలంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. చిన్నదోర్నాలలో నూతన సచివాలయ భవనాన్ని అద్భుతంగా నిర్మించారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సుపరిపాలన చేసుకుంటూ అభివృద్ధి సాధించాలని మంత్రి సురేష్ ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరిపాలనను అందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి తోడ్పాటునందించాలని కోరారు.



ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి సురేష్

రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ

ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు మంత్రి ఆదిమూలపు సురేష్ ఎక్స్‌గ్రేషియా చెక్కులు పంపిణీ చేశారు. సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముగ్గురు రైతులకు చెందిన నామినీలకు చెక్కులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రైతు యాంత్రీకరణ పథకం ద్వారా 81 లక్షల 47 వేలు విలువ చేసే ఏడు ట్రాక్టర్‌లను 29 లక్షల 45 వేల 200 రూపాయల సబ్సిడీతో రైతు సంఘాలకు అందజేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్ ట్రాక్టర్‌ను నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ విజయ, ఎంపీపీ, గుమ్మా పద్మజ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజగొర్ల సుశీల పిచ్చయ్య యాదవ్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా, కార్యదర్శి సునీత, నాయకులు గుమ్మా యల్లేష్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, జంకె సుబ్బారెడ్డి, జడ్డు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు

ముండ్లమూరు: మండలంలోని ఈదరలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఐక్యంగా నిర్మించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా వెంకాయమ్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకాయమ్మకు మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేయనున్నట్లు తెలిపారు. వేద పండితులు ఇచ్చిన తీర్థ ప్రసాదాలు బూచేపల్లి వెంకాయమ్మ స్వీకరించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూది దేవర అంజయ్య, సర్పంచ్ వంగల పద్మావతి, రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, నాయకులు అబ్బని అంజిరెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ముగిసిన నైపుణ్య శిక్షణ తరగతులు

యర్రగొండపాలెం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ నైపుణ్య శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన యువతీ, యువకులు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిశారు. శిక్షణ పొందిన వారిని అభినందించి కోర్స్ కంప్లీట్ సర్టిఫికెట్లతో పాటు ఉద్యోగ నియామక పత్రాలు మంత్రి, కలెక్టర్ అందజేశారు. నిరుద్యోగులుగా ఉన్న తమకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ తిరుమలనాయుడు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, మెప్మా పీడీ టి.రవికుమార్, డీఐసీ జీఎం శ్రీనివాసరావు, హ్యాండ్లూం ఏడీ ఉదయ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఏఈఓ బీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి సురేష్, కలెక్టర్

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

యర్రగొండపాలెం: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుని తమ కుటుంబాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని యర్రగొండపాలెం, త్రిపురాంతకం కళాశాలలకు చెందిన కాంట్రాక్ట్ లెక్చరర్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయా కళాశాలల్లో పనిచేస్తున్న పది మంది లెక్చరర్లు మంత్రితో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్లు మంత్రి సురేష్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఆర్‌ఐగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



ఆర్‌ఐ నాగరాజు

కురిచేడు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న నాగరాజు ఆర్‌ఐగా బదిలీపై కురిచేడు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను వీఆర్వోలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాలను సందర్శించిన కమలానంద భారతి



ఆలయంలో స్వామి కమలానంద భారతి

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి కమలానంద భారతి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలకు వచ్చిన ఆయనకు ఆలయాల వద్ద పండితులు సాదర స్వాగతం పలికారు. అనందరం ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

పంట వ్యర్థాలను కలియదున్నాలి

తాళ్లూరు: పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని తురకపాలెంలో పంట వ్యర్థాలు కాలుస్తున్న రైతులకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. మొక్కజొన్న, నువ్వులు, పత్తి, చెరకు తదితర వ్యర్థాలను తగల బెడుతున్నారని, దీని వలన జీవరాశులు చనిపోవడమేగాక సేంద్రియ కర్బనం స్థూల సూక్ష్మ పోషకాలన్నీ కాలి బూడిదవుతాయని చెప్పారు.

అంగన్‌వాడీల్లో మెరుగైన విద్య

పొదిలి: మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఐసీడీఎస్ పొదిలి ప్రాజెక్టు సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. సోమవారం పొదిలిలో జన భాగీదారీ ర్యాలీని ఆమె ప్రారంభించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి విశ్వనాథపురం సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి, అంగన్‌వాడీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలి



పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కుప్పం ప్రసాద్

ముండ్లమూరు: ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగితేనే తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ అన్నారు. మండల కేంద్రం ముండ్లమూరులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆక్రమణ జరుగుతుండగా స్థానిక ఆర్య వైశ్య నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందిన ప్రసాద్ సోమవారం ముండ్లమూరు చేరుకొని ఆక్రమణను అడ్డుకున్నారు. సమస్యను రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించారు. విగ్రహం వద్ద టిఫిన్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న వారికి నచ్చజెప్పి ఆక్రమణ సరికాదన్నారు. ఆక్రమణకు ప్రయత్నించిన వారు వెనక్కి తిరిగారు. కాంప్లెక్సు నిర్మాణ దారునితో చర్చించారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పులికొండ శ్రీనివాసరావు, అమరా ప్రసాద్, బ్రహ్మేశ్వరరావు, అమరా భాను, దేవత శ్రీను, కనగండ్ల సుధాకర్, పులికొండ వెంకట్రావు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయాలి

- డ్వామా పీడీ శీనారెడ్డి



మాట్లాడుతున్న పీడీ శీనారెడ్డి

బేస్తవారిపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేసిన ప్రదేశంలో తప్పనిసరిగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని డ్వామా పీడీ శీనారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఉద్యానవన పంటల్లో మొక్కలు చనిపోతే కొత్త మొక్కలు నాటించాలని సూచించారు. పనుల్లో జరిగిన అవకతవకలపై విధించిన రికవరీలు ఎప్పటికప్పుడు చెల్లించాలని సిబ్బందికి సూచించారు. గతేడాది ఆడిట్ రికవరీ ఇప్పటికి చెల్లించకపోతే ఈ ఏడాది కూడా రికవరీ ఉంటే కలెక్టర్ టీఏ, ఫీల్డ్‌అసిస్టెంట్‌లను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే వారిని ఉపాధి హామీ పనులకు అనుతించకూడదన్నారు. 2022–23 మార్చి నెలకు బేస్తవారిపేట మండలంలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఎస్ఎస్ఏ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల్లో 1006 వర్క్‌లకు రూ.15.94 కోట్ల ఖర్చుపై ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ, ఎస్ఆర్‌పీ సుబ్బారావు, ఎంపీడీఓ ఎస్.చెన్నకేశవరెడ్డి, ఏపీడీ భాస్కరరావు, ఏపీఓ గురువరప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

కురిచేడు: వినుకొండ నుంచి కూరగాయల లోడుతో వస్తున్న ఆటో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వ్యక్తిని తప్పించబోయి బోల్తా కొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం ఉదయం జరిగింది. వివరాలు.. బురుజుల కోటేశ్వరరావు అనే వ్యక్తి తన ఆటోలో వినుకొండ మార్కెట్ నుంచి కూరగాయలు వేసుకుని కురిచేడు వస్తున్నాడు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చే సరికి రోడ్డు పక్కన ఉన్న వ్యక్తికి ఆటో తగులుతుందేమోనని పక్కకు తిప్పి సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తాపడింది. ఆటో టాప్ మొత్తం నుజ్జునుజ్జుకాగా బురుజుల కోటేశ్వరరావు, గాదె వెంకట సుబ్బయ్యలకు గాయాలయ్యాయి. అక్కడకు చేరుకున్న ప్రజలు ఆటోను పైకి ఎత్తారు. గాయపడిన ఇద్దరిని వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు.



బోల్తా పడిన ఆటో, కూరగాయలు

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి



జేవీకే కిట్లు అందుకున్న విద్యార్థినులతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడచిన 75 ఏళ్లలో కానరాని అభివృద్ధి నాడు–నేడు కార్యక్రమంతో నేడు పాఠశాలల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. విద్యార్థుల కోసం అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన లాంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, సీఐ భీమానాయక్, ఎంఈఓ రామ్‌దాస్ నాయక్, హెచ్‌ఎంలు శ్రీదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు విద్యా కానుక

కొనకనమిట్ల: స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం జేవీకే కిట్లను హెచ్‌ఎం సుజాత, పాఠశాల కమిటీ చైర్మన్ కడెం ఆంజనేయులుయాదవ్ అందజేశారు. తెలుగు, ఇంగ్లిష్ డిక్షనరీలు పంపిణీ చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యా కానుక అందిస్తోందని వారు పేర్కొన్నారు.

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, స్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుజాత, హెచ్‌ఎం సుధాకర్, సర్పంచ్ వరాలు, ఎంపీటీసీ వి.అంకమ్మ, వైస్ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, శ్రీను, నాయుడు, ఆనందబాబు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు, సుంకేసుల, ఏనుగులదిన్నెపాడు గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం సర్పంచ్‌లు పంపిణీ చేశారు. విద్యా కానుక కిట్లను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉన్నత ఆశయాలతో రాణించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. సర్పంచ్‌లు దుగ్గెం చెన్నమ్మ, గుడ్డెపోగు రమేష్, బలుసుపాటి లూథియా, హెచ్‌ఎంలు ఎం. కనకదుర్గ, పి.ఆంజలి, పి.కృష్ణప్రసాద్, పాఠశాలల చైర్మన్లు దుగ్గి నారారెడ్డి, ఏర్వ పెద్దశివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కోటగడ్డ వీధి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దర్ల శ్రీను చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముద్దర్ల శ్రీను మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతోందన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆవులరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కంభం: జగనన్న విద్యాకానుకలు పేద విద్యార్థులకు వర మని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జగన్న విద్యాకానుకల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు, రాతపుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, బ్యాగులు, డిక్షనరీలు, ఇతర వస్తువులు అందించడం విశేషమంటూ కొనియాడారు. ఎంఈఓ మాల్యాద్రి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు సోమవారం పంపిణీ చేశారు. జేవీకే కిట్లను ఎస్‌ఎంసీ చైర్మన్ నుసుం అంజని నాగిరెడ్డి, వైస్ చైర్మన్ నాగరాజు, మాజీ చైర్మన్ దర్గారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మాధవి చేతులమీదుగా అందజేశారు. విద్యార్థులు విద్యనభ్యసించడంలో ముందుండాలని, వారికి ఎటువంటి లోటు లేకుండా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల ప్రారంభం రోజే అందజేశారని చైర్మన్ నుసుం అంజని నాగిరెడ్డి పేర్కొన్నారు.

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందించనున్నట్లు పీఎంసీ చైర్మన్ లక్ష్మీకుమారి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరిప్పించాలన్నారు. హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందజేయనున్నామని, త్వరలోనే జగనన్న విద్యాకానుకతో పాఠశాలలకు రావాలన్నారు. ముఖ్యంగా డ్రెస్ కోడ్ తప్పని సరిగా వాడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జానీబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగనన్న కానుకలు అందిస్తున్న ఎంపీపీ



కురిచేడులో..



కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ




విద్యార్థులతో ఎంపీపీ, ఉపాధ్యాయులు



కొనకనమిట్లలో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఎదురు పుల్లారెడ్డి తన సొంత ఖర్చులతో గ్రామంలోని యూపీ స్కూల్‌కు కంప్యూటర్, విద్యార్థులకు నోట్ పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు రంగారెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు ఉపయోగపడే కంప్యూటర్ పరికరాలతో పాటు పాఠశాలలో 1 నుంచి 6వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేయడం చాలా గొప్ప విషయమన్నారు. దాత సాయం గుర్తుంచుకుని విద్యను అభ్యసించాలని కోరారు. విద్యా కమిటీ చైర్మన షేక్ మాబూచాంద్, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎదురు సుబ్బారెడ్డి, కోటి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు సచివాలయం పరిధిలోని రేగడపల్లి, బోడపాడు ఎస్సీ కాలనీ, వాగుమడుగు గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 గంటలు, సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు గ్రామంలో పునర్నిర్మించిన రామాలయం, ఉపాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నూతన విగ్రహ, జీవ, ధ్వజ ప్రతిష్ఠ, నవగ్రహ, గణపతి సుబ్రహ్మణ్య, నాగేంద్ర స్వామి, శీతలాదేవి గమిడి దేవతల గ్రామోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుడు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో సహస్రనామ పూజ, రుద్ర, నవగ్రహ హోమాలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రికి పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి పౌరాణిక నాటకం ప్రదర్శించారు.

పొదిలి రూరల్: కుంచేపల్లి పంచాయతీలోని దాసళ్లపల్లిలో సోమవారం గణపతి, సీతాలక్ష్మణ హనుమాన్ సహిత పట్టాభి రామచంద్ర స్వామి విగ్రహాలు, నాభి శిల, జీవ ధ్వజ, శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



తువ్వపాడులో దేవతా విగ్రహాల గ్రామోత్సవం

26 నుంచి కుష్టువ్యాధిపై అవగాహన సదస్సులు

పుల్లలచెరువు: జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధి నివారణపై ఈ నెల 26 నుంచి అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా క్షయ, కుష్టు నియంత్రణాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిపై విచారణ కోసం వచ్చారు. గత నెల 18వ తేదీన పుల్లలచెరువు ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహిస్తుండగా ఆ సమావేశంలో నాయుడుపాలెం పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎం దేవికాబాయ్ వైద్యాధికారులను అసభ్య పదజాలంతో మాట్లాడారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని వైద్యశాలలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను వచ్చి విచారణ చేసి నివేదికను జిల్లా అధికారులకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ఆశా కార్యకర్తలు, వలంటీర్లతో ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టువ్యాధి మచ్చలు ఉన్న వారిని గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి టీబీ ముక్తి పంచాయతీ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో టీబీపై ప్రజలకు అవగాహన కల్పించి టీబీ రహిత పంచాయతీలు తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. టీబీ ఉన్న వారు ప్రభుత్వ వైద్యశాలలోనే మందులు తీసుకోవాలన్నారు. ఈ రెండు కార్యక్రమాలపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు భారీ ఎత్తున అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రేడియో బావి సమీపం అభయాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఈ నెల 14వ తేదీన మెగా రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేయదలచిన వారు రక్తదాన శిబిరంలో రక్తం ఇవ్వాలని కోరారు.